క్లుప్తంగా

మైనర్ బాలిక వివాహం.. సంక్షేమ గృహానికి తరలింపు

నారాయణపేట రూరల్: మండలంలోని ఓ తండాలో 6వ తరగతి చదువుతున్న బాలికకు గురువారం ఉదయం బలవంతంగా వివాహం చేశారు. బాల్య వివాహ సమాచారం తెలుసుకున్న జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారులు, రూరల్ పోలీసులతో కలిసి తండా చేరుకొని విచారణ చేశారు. వివాహం జరిగిన విషయాన్ని ధ్రువీకరించుకొని బాలికను నారాయణపేటలోని బాలల సంక్షేమ గృహానికి తరలించారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ సిబ్బంది శ్రావణ్‌కుమార్, భాగ్యశ్రీ, పోలీస్ సిబ్బంది కుర్మన్న, శ్యామ్ పాల్గొన్నారు.

'ఇస్రో' సందర్శనకు తీలేర్ విద్యార్థులు



మరికల్: మండలంలోని తీలేర్ విద్యార్థులు గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని ఇస్రో కార్యాలయాన్ని సందర్శించారు. తెలంగాణ ఫిలడెల్ఫియా, డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్, అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో తీలేర్ ఎంపీయూపీఎస్ విద్యార్థులను షార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కార్యాలయంలోని శాస్త్రవేత్తల ప్రయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అనురాధ, వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలి'

నారాయణపేట రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో 69 జీఓ ద్వారా చేపట్టాల్సిన నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని మండల బీజేపీ అధ్యక్షుడు జ్యోతి సాయిన్న గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలని పేర్కొన్నారు.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



ధన్వాడ: ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివేంద్రాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్రయ్య, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, రహిమన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి'



ధన్వాడ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి అంటూ అధ్యాపకులు కరపత్రాలు పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి వెళ్తున్న విద్యార్థులకు ధన్వాడ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కరపత్రాలు అందజేశారు. డిగ్రీ కళాశాలలో ఉత్తమ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. కావలి పద్మమ్మకు రూ.65,000, అవిటి వీరన్నకు రూ.15,000 చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కే.పార్థీవగౌడ్, మాజీ ఎంపీటీసీ అనితా చెన్నయ్య, నీలారెడ్డి, వెంకటయ్య, మన్నాపూర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందని నీరు.. ఎండుతున్న పంటలు



నీరులేక ఒట్టిపోయిన కుడి కెనాల్



మాగనూర్ శివారులో ఎండుముఖం పట్టిన వరి పంట

మాగనూర్: అధికారుల నిర్లక్ష్యంతో మాగనూర్ మండల పరిధిలోని కుడి లోలెవల్ కాలువకు నీరు రావడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుకాలం కష్టించి పండించిన పంట చేతికందే సమయంలో సాగునీరందక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ముఖ్యంగా మండల పరిధిలో వరి వేసుకున్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండుముఖం పడుతున్నాయని ఆదుకోవాలని కోరుతున్నారు.

చివరి ఆయకట్టుకు అందని నీరు..

ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందించాల్సి ఉండగా, కెనాల్‌లో తక్కువగా నీరు విడుదల చేయడంతో చివరి భూముల వరకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి సాగు చేసిన పంటలకు సాగునీరు అందక ఎండుముఖం పడుతున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుడి లోలెవల్ కెనాల్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని కోరుతున్నారు.

పనికి ఒకరు.. పేరు మరొకరిది

- రికవరీకి టీఏలకు, ఎఫ్ఏలకు ఆదేశాలు
- రూ.7.10 కోట్లకు సోషల్ ఆడిట్



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ మొగులప్ప

మక్తల్: మండలంలో చేపట్టిన మహత్మగాంధీ ఉపాధి హామీ పనులు 2023–24 సంవత్సరానికి సంబంధించి పనులకు గాను రూ.7.10 కోట్లకు సోషల్ ఆడిట్‌పై గురువారం ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. మండలంలోని ఉపాధి హామీ కింద చేపట్టిన రూ. 4,35,52,600 ఖర్చు చేశారని సామగ్రి ఖర్చు రూ. 2.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కూలీలకు రూ.4.57 కోట్లు, పంచాయతీ రాజ్ కింద గ్రామాల్లో 54 పనులను సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కూలీల ఖర్చు రూ.1.80 లక్షలు, సామగ్రి ఖర్చు రూ.1.45 కోట్లు ఖర్చు చేశారన్నారు. మండంలోని యర్నాన్‌పల్లి నర్సరీల్లో కూలీలకు రూ.7.99 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీ బృందంలో ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగనట్లు గుర్తించామన్నారు. ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్లినట్లు గుర్తించామన్నారు. అయితు రికార్డులు, ఎంబీబి రికార్డ్లు, మస్టర్లు కొట్టివేయడం జరిగిందన్నారు. చాలా గ్రామాల్లో కూలీలు సక్రమంగా రాకపోవడంతో నర్సరీల్లో మొక్కలు ఎండిపోయాయన్నారు. కొంత మందికి మేట్లు పనికి రాకుండా హాజరు వేయడంతో వారికి రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ రికార్డులు సక్రమంగా లేవని, లెక్కలు తప్పుగా చేశారని అధికారుల ముందు డీఆర్‌పీలు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన ఎఫ్ఏ, టీఏలకు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి మొగులప్ప, అంబుట్స్ పర్సన్ నాగిరెడ్డి, ఎస్‌టీఎం అజయ్, క్వాలిటీ అధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ రమేష్, రవికుమార్, ఏపీఓ గౌరిశంకర్, విజయ్, డీఆర్పీలు, ఎస్ఆర్పీలు, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది



బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సాయికుమార్

నారాయణపేట ఎడ్యుకేషన్: అసెంబ్లీలో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించాడని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను గురువారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయంచడం దారుణమన్నారు. విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల మేనిఫెస్టోలో విద్యా రంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో రెండోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన కూడా విద్యారంగానికి మొండిచూపు చూపడం దారుణమన్నారు. విద్యారంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, విద్యార్థి సంఘాలతో చర్చించి విద్యా రంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కోశాధికారి మహేష్, జిల్లా నాయకులు సాగర్, రాజు, గణేష్, విష్ణు, లక్ష్మి, శ్రీను, శ్రావణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపునకు నిధులు కేటాయించాలి



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న దివ్యాంగులు

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని, అందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం 5 శాతం అంటే రూ.11,349.1 కోట్లు నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖలోనే అంతర్భాగా దివ్యాంగుల సంక్షేమ శాఖ చూపి నిధులు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న దివ్యాంగులను ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ, వెంకటయ్య, రాములు, చెన్నప్ప, హన్మంతు, లక్ష్మమ్మ, మంగమ్మ, శకుంతల, చిట్టెమ్మ, నారెమ్మ, రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



నందిపాడులో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన యువజన సంఘం సభ్యులు

కృష్ణా: మండల పరిధిలోని ముడుమాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అంజన గార్డెన్ అధినేత శ్యాంప్రసాద్‌రెడ్డి, లయన్స్ క్లబ్ నారాయణపేట, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రావ్‌ల సహాయంతో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ నిజాముద్దీన్ మాట్లాడుతూ.. దాతల ఔదార్యం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, కుర్మయ్య, గాయత్రి, శ్రీనివాస్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఫోటో 20ఎంకేఎల్ 305 పరీక్ష సామాగ్రి అందజేస్తున్న దాతలు

పరీక్ష ప్యాడ్ల అందజేత

మద్దూరు: మండలంలోని నందిపాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి

ఊట్కూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. రికార్డులు పరిశీలించి ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు పని స్థలం వద్ద తాగునీరు, టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సిబ్బంది విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కోస్గి రూరల్: కోస్గి, గుండుమాల్ మండల పరిధిలోని వాగు సమీపంలో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణ జరుగుతోంది. ఈ క్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి గుండుమాల్ వాగు సమీపంలో గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



నారాయణపేట ఎడ్యుకేషన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని స్థానిక స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, రాము, విష్ణు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ల బహిరంగ వేలం

మద్దూరు: పట్టణంలో ప్రతి గురువారం నిర్వహించే తైబజార్, పశువుల సంతను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు బహిరంగ వేలాన్ని ఈనెల 27న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఒక్కో సంతకు రూ.5 లక్షల డీడీ గానీ, నగదు రూపంలో గానీ ఈనెల 26 సాయంత్రం 4 గంటల వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే దరఖాస్తు ఫారానికి రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మరికల్: గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఈనెల 24న మరికల్ తైబజార్‌కు వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్యామ్‌సుందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రూ.50 వేల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నాలని సూచించారు.

ధన్వాడ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే తైబజార్‌కు బహిరంగ వేలం పాటను ఈనెల 25న పంచాయతీ కార్యాలయ అవరణలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఊట్కూరు: బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను చట్ట సభల్లో ఆమోదం పొందడంపై మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజ్ఞేశ్వర్‌రెడ్డి, లింగం, సూర్యప్రకాష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తమ భవిష్యత్‌కు కృషి



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చేతుల మీదుగా వివిధ పాఠశాలల విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉండి చూపు మందగించిన విద్యార్థులకు ప్రభుత్వం కంటి శిబిరాలు ఏర్పాటు చేసి కంటి అద్దాలు పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య అధికారి సౌభాగ్యలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు, ఆర్‌బీఎస్‌కె వైద్య సిబ్బంది, మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ, నారాయణపేట కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నారాయణపేట : అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్.పర్ణికారెడ్డి అన్నారు. బీసీ, ఎస్సీ బిల్లుల ఆమోదంపై గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ కుల సంఘాల నాయకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన 15 నెలల్లోనే పారదర్శంగా శాస్త్రీయ పద్ధతిలో కుల గణన సర్వే నిర్వహించి ఆ సర్వే ఆధారంగా రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించినట్లు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో, ఉద్యోగ నోటిఫికేషన్లలో లబ్ధి చేకూరే విధంగా రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, వివిధ మండలాల అధ్యక్షులు రవీందర్, నరహరి, బాల్ రెడ్డి, కోట్ల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి దోహదం

ధన్వాడ: క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ రెజ్లింగ్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను క్రీడాకారుల హబ్‌గా చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారని, రెజ్లింగ్‌లో ధన్వాడ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతి కనబరచడం సంతోషకరమన్నారు. అలగే మండల కేంద్రంలో బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, డీవైఎస్ఓ వెంటటేశ్వర్ శెట్టి, తహసీల్దార్ సింధూజ, ప్రిన్సిపాల్ గంగమ్మ, సాయిప్రకాష్, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మీర్జాపూర్‌లో భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కోస్గి రూరల్: కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామం నుంచి బోలోనిపల్లి వరకు రూ.3.90 కోట్లు నిధులతో 3 కి.మీ బీటీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మీర్జాపూర్ నుంచి పీసీ తండా వరకు త్వరలోనే బీటీ రోడ్డు మంజూరు చేస్తామన్నారు. అంతకుముందు కొడంగల్ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో కోస్గి మండల పరిధిలోని 36 మంది లబ్ధిదారులకు రూ.22 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జురాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సొంత జిల్లాకే మొండిచేయి

నారాయణపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి పాలమూరుకు మొండి చేయి చూపించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు మరో పది శాతం పనులకు నిధులు కేటాయిస్తే కాల్వలు పూర్తి అయ్యి జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే నెపంతో నిధులు కేటాయించకపోవడం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

బెట్టింగ్‌లపై నిఘా ఉంచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న యువక మండలి సభ్యులు

మరికల్: క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు నిఘా పెట్టాలని యువక మండలి ఆధ్వర్యంలో గురువారం ఎస్ఐ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో యువత జోరుగా బెట్టింగ్‌లకు పాలుపడుతున్నారన్నారు. యువత అప్పుల ఊబిలో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పోలీసులకు వివరించారు. మరికల్ చౌరస్తాలోని కిరాణ దుకాణాలు, హోటళ్లు, ఇంటర్‌నెట్ కేఫ్‌ల వద్ద యువకులు ఆన్‌లైన్, నగదు రూపంలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. యువతకు అవగాహన కల్పించాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో యువక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఊట్కూరు: మండలంలో పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ దత్తురావు, సత్యనారాయణ తెలిపారు. మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పులిమామిడి జెడ్పీహెచ్ఎస్ జిల్లా పరిషత్ పాఠశాల, పులిమామిడి కేజీబీవీ పాఠశాల, ఊట్కూరు బాలుర ఉన్నత పాఠశాల, ఊట్కూరు బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 471 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నాలుగు సెంటర్లలో పరీక్షలు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని 15 పాఠశాలకు చెందిన 851 మంది విద్యార్థులు నేటి పట్టణంలోని నాలుగు సెంటర్లలో పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈఓ బాలకిష్టప్ప గురువారం తెలిపారు.

ముగిసిన ఇంటర్ వార్షిక పరీక్షలు



మరికల్‌లో పరీక్ష కేంద్రం వద్దవిద్యార్థులు

మరికల్: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల్లో పది రోజుల పాటు జరిగిన ఇంటర్ మొదటి, రెండో సంవత్సర వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ పరీక్ష కేంద్రం నుంచి ఉత్సహంగా బయటకు వచ్చారు. మక్తల్: మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారంతో ముగిశాయి. ప్రభుత్వ జూనియర్, మైనార్టీ గురుకుల కేంద్రాల్లో 895 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మరికల్: మండల కేంద్రంలో భారత్ వికాస్ పరిషత్, ఎనీమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీవాణి పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి మందులు అంజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినితమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.